సాక్షి
సూర్యాపేట
గురువారం ၊ 5 ၊ జూన్ ၊ 2025



లారీని ఢీకొట్టిన బస్సు
ఖైతాపురం స్టేజీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా 18 మంది గాయపడ్డారు. - 12లో



నైపుణ్యాన్ని వెలికితీసేందుకు కృషి
క్రీడాకారుల్లో క్రీడానైపుణ్యాన్ని వెలికితీసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. - 12లో

గరిష్టం/కనిష్టం
38°/26°

వాతావరణం
పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

నడిగూడెం : సూర్యాపేట జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న గెస్ట్ టీచర్లు, గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు ఈ నెల 9 లోపు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ జిల్లా సమన్వయకర్త సీహెచ్.పద్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇమామ్‌పేట గురుకుల పాఠశాలలో జూనియర్ లెక్చరర్లు ఇంగ్లిష్, గణితం పోస్టులకు, జాజిరెడ్డిగూడెం పాఠశాలలో గణితం, తుంగతుర్తి గురుకుల కళాశాలలో ఎకనామిక్స్, పీజీటీ ఇంగ్లిష్, పీజీటీ గణితం, పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. సంబంధిత సబ్జెక్టుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలని, అలాగే బీఈడీ కూడా పూర్తి చేసిన అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులని తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో బోధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఇమామ్‌పేట గురుకుల పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

సూర్యాపేటటౌన్ : పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పబ్బతి వెంకటేశ్వర్లు, కె.వేణు కోరారు. గత విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో నియమితులైన పారిశుద్ధ్య కార్మికుల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ డీటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సూర్యాపేట జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఒకటి రెండు రోజుల్లో జీతాలు చెల్లించడానికి ప్రయత్నం చేస్తామని డీఈఓ హామీ ఇచ్చినట్టు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు



దరఖాస్తు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

హుజూర్‌నగర్ : భూ సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబు తెలిపారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు తమ సమస్యలపై దరఖాస్తు అందజేస్తే వాటిపై క్షేత్ర స్థాయిలో విచారణ చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జున రెడ్డి, ఆర్‌ఐలు గాలి శ్రీను, షరీఫ్, అధికారులు పాల్గొన్నారు.

ఎన్జీ కాలేజీ డిగ్రీ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న అధ్యాపకులు

రామగిరి(నల్లగొండ) : ఎన్జీ కాలేజీ డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్ల ఫలితాలను బుధవారం ఎంజీయూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎన్జీ కళాశాల పరీక్షల నియంత్రణాధికారి బత్తిని నాగరాజు ఫలితాలను విశ్లేషించారు. బీబీఏ, బీకామ్ విభాగాల్లో అత్యధికంగా 87 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని.. చివరి సంవత్సరం పూర్తిచేసిన విద్యార్థుల్లో బీబీఏ 83శాతం, బీకామ్ 80 శాతం, బీఏ, బీఎస్సీ లైఫ్ సైన్స్ విద్యార్థులు 69శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పరంగి రవికుమార్, అడిషన్ సీఓఈ డాక్టర్ వైవి.ప్రసన్నకుమార్, అధ్యాపకులు కోటయ్య, చంద్రయ్య, నాగరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల తరహాలో యాదగిరి క్షేత్రం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రాన్ని తిరుమల తిరుపతి తరహాలో అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. ఆలయంలోని వివిధ విభాగాలు, శాఖల అధికారులతో బుధవారం కొండపై గల అతిథిగృహంలో సమావేశం అయ్యారు. ఈఓ వెంకట్రావ్, కలెక్టర్ హనుమంతరావుతో కలిసి ఆలయ అభివృద్ధిపై సమీక్షించారు. పెండింగ్ పనులు, జరగాల్సిన అభివృద్ధిపై చర్చించారు.

మూడు నెలలు.. ఆరుసార్లు!



తుంగతుర్తిలో రేషన్‌షాపు వద్ద బియ్యం కోసం బారులుదీరిన లబ్ధిదారులు

రేషన్ బియ్యం పంపిణీకి అష్టకష్టాలు

- ప్రతి కార్డుదారుడు ఆరుసార్లు వేలిముద్ర వేయాల్సిందే
- ఒక్కో కార్డుకు 15 నిమిషాల సమయం
- రేషన్‌దుకాణాల వద్ద లబ్ధిదారుల పడిగాపులు
- సాఫ్ట్‌వేర్ మార్చాలంటున్న రేషన్ డీలర్లు

రేషన్ దుకాణాలు	610
ఆహార భద్రత కార్డులు	3,04,317
అంత్యోదయ కార్డులు	19,832
అన్నపూర్ణ	36
మూడునెలల కోటా	1,78,000క్వింటాళ్లు

నాగారం : రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ మొదలైంది. రెండు, మూడు నిమిషాల వ్యవధిలో పూర్తయ్యే పంపిణీ ప్రక్రియ ఇప్పుడు ఆలస్యమవుతోంది. ఎక్కువ బియ్యం ఇవ్వాల్సి రావడంతో అన్ని రేషన్ దుకాణాల వద్ద రద్దీ నెలకొంటోంది. దీనివల్ల డీలర్లకు, లబ్ధిదారులకు ఇబ్బంది కలుగుతోంది. బియ్యం పంపిణీకి వినియోగించే ఈ–పాస్ యంత్రాల అప్‌డేట్, మూడు మాసాల బియ్యం ఒకేసారి పంపిణీ, మారిన సాఫ్ట్‌వేర్ తదితర కారణాలు లబ్ధిదారులకు శాపంగా మారాయి. ఒక్కొక్కరికీ బియ్యం పంపిణీకి సుమారు 15 నిమిషాల సమయం పడుతోంది. దీంతో రేషన్ దుకాణాల వద్ద వినియోగదారులు విసుగు చెందుతున్నారు.

జిల్లాలో 610 రేషన్ దుకాణాలు

జిల్లా వ్యాప్తంగా 610 రేషన్ దుకాణాలు, 3.24 లక్షల రేషన్ కార్డులున్నాయి. వీటిలో 9.31లక్షల మంది సభ్యులుగా నమోదై ఉన్నారు. వీరికోసం మూడు నెలలకు గాను 1,78,000 క్వింటాళ్ల బియ్యం అవసరమని అధికారులు గుర్తించారు. ఆ మేరకు నిల్వలను సర్దుబాటు చేస్తున్నారు.

ఆరు సార్లు వేలి ముద్రలు..

రేషన్ దుకాణాల్లో కార్డుదారుల్లోని ఒక్కో సభ్యుడికి 6 కిలోలు చొప్పున బియ్యం ఇస్తారు. అంత్యోదయ కార్డు కింద 35 కిలోలు, అన్నపూర్ణ కార్డు ఉన్న వారికి ఉచిత బియ్యం ఇచ్చేవారు. ప్రస్తుతం ప్రభుత్వాలు ఉచితంగా రేషన్ ఇస్తుండటంతో ఎవరూ డబ్బులు చెల్లించడం లేదు. తెల్లరేషన్ కార్డుదారుల్లో ఒక కుటుంబంలో నలుగురు వ్యక్తులు ఉన్నారనుకుంటే వారికి నిర్దేశిత కోటా ప్రకారం ప్రతినెలా వీరికి 24 కిలోలు బియ్యం వచ్చేది. ఇందులో కేంద్రం వాటా కింద 20 కిలోలు, రాష్ట్ర వాటా 4 కిలోలు బియ్యం ఉంటాయి. (ఒకరికి వచ్చే 6 కిలోల్లో 5 కేజీలు కేంద్రం, మిగతా 1కిలో రాష్ట్ర వాటా). ఈ బియ్యం తీసుకునేందుకు కేంద్రం, రాష్ట్ర వాటాకు సంబంధించి వేర్వేరుగా (ప్రతినెలకు రెండు సార్లు) వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. ఇప్పుడు.. జూన్, జూలై, ఆగస్టు మాసాలకు సంబంధించిన బియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో మూడు నెలలకు సంబంధించి ఒక్కో లబ్ధిదారు ఆరు సార్లు వేలిముద్రలు వేయాల్సి వస్తోంది. ఒక్కో వ్యక్తి ఇన్నేసి సార్లు వేలిముద్ర వేయడం, మధ్యలో సరిగా ముద్ర పడకపోతే మరోమారు ప్రయత్నించాల్సి వస్తోంది. తర్వాత వారి బియ్యం కోటాను తూకం వేసివ్వాలి. ఈ ప్రక్రియంతా పూర్తి కావడానికి 15 నిమిషాలకు పైగాసమయం పడుతోంది. దీంతో లబ్ధి దారులంతా వారి వంతు వచ్చేవరకు ఎదురుచూడక తప్పటం లేదు. దీనికి తోడు సర్వర్ బిజీ, నెట్ సిగ్నల్ సక్రమంగా లేకపోవడంతో, బ్లూటూత్ కనెక్ట్ కాకపోవడం తదితర అంశాలు వేధిస్తున్నాయి. అలాగే అంత్యోదయ కార్డులు కేంద్ర వాటా కింద రావడంతో వీరు ఒకసారి (మూడు నెలలకు మూడు సార్లు) వేలిముద్ర వేస్తే సరిపోతుంది.

ఒకేసారి కేటాయిస్తే..

కేంద్ర, రాష్ట్ర వాటాల కింద వచ్చే బియ్యానికి వేర్వేరుగా వేలిముద్రను తీసుకోవడం వల్ల జాప్యం ఏర్పడుతోంది. దీనివల్ల క్షేత్రస్థాయిలో డీలర్లు, లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. కొన్ని సందర్భాల్లో చిన్నచిన్న వాగ్వాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. పరిస్థితిలో మార్పు రావాలంటే ఒక కార్డులో ఎంత బియ్యం ఉంటే అంత మొత్తానికి ఒకేసారి వేలిముద్ర వేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డీలర్లు కోరుతున్నారు. దానికనుగుణంగా సాఫ్ట్‌వేర్‌ను మార్పు చేయాలని, అప్పుడే క్షేత్రస్థాయిలో ఫలితముంటుందని చెబుతున్నారు.

నెలాఖరు వరకు బియ్యం సరఫరా..



మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేపట్టడంతో ఈ నెలాఖరు వరకు బియ్యం పంపిణీ చేసేలా ఈపాస్ యంత్రాలు పనిచేస్తాయి. గతంలో ప్రతి నెల 15వ తేదీ వరకు పనిచేసేవి. ఇప్పుడు నెలాఖరు వరకు సమయం ఇచ్చారు. పంపిణీలో ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. కార్డుదారులు ఒకేసారి రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి ఇబ్బందులు పడొద్దు, అందరికీ బియ్యం అందుతాయి. ఎవరూ కూడా ఆందోళన చెందవద్దు.

– మోదుగు శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి డీఎస్‌ఓ, సూర్యాపేట

ఒక పూట సమయం పట్టింది



రేషన్ బియ్యం కోసం దుకాణానికి వెళ్లి కార్డు సీరియల్‌లో పెట్టాను. నా సీరియల్ వచ్చేసరికి ఉదయం వెళితే మధ్యాహ్నం అయింది. నాకు ప్రతి నెలా 24 కేజీల బియ్యం వస్తాయి. మూడు నెలలకు కలిపి 72 కిలోల బియ్యం వచ్చాయి. వేలిముద్రలు వేసి బియ్యం తీసుకునేసరికి 20 నిమిషాల సమయం పట్టింది.

– ఎస్.కె. మన్సూర్, తుంగతుర్తి

పారిశుద్ధ్య నివేదికకు ససేమిరా..

- డెయిలీశానిటేషన్ రిపోర్ట్ యాప్‌పై నిరసన
- పదిరోజులుగా నమోదు చేయని పంచాయతీ కార్యదర్శులు
- ఇప్పటికే పాలకవర్గాలు లేక ఉన్న పనులతో సతమతమవుతున్నామని ఆవేదన



ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన డీఎస్ఆర్ యాప్

నాగారం : గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ నివేదికను ఎప్పటికప్పుడు డీఎస్ఆర్(డెయిలీ శానిటేషన్ రిపోర్ట్) యాప్‌లో నివేదించాలన్న ప్రభుత్వ నూతన మార్గదర్శకాలను పంచాయతీ కార్యదర్శులు పక్కన పెట్టారు. ఆన్‌లైన్ ద్వారా నివేదికలను అందజేయాలంటే తమకు భారంగా మారుతోందని చెబుతున్నారు. పది రోజులుగా ఆన్‌లైన్ నివేదికను యాప్‌లో నమోదు చేయడం లేదు. జిల్లాలో 486 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 460 మంది కార్యదర్శులు పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పాలకవర్గాలు లేక, నిధులు విడుదలకాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పులుచేసి పంచాయతీల్లో చిన్నపాటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. డీఎస్ఆర్ యాప్‌లో పారిశుద్ధ్య నివేదికను రోజువారీగా నమోదు చేయాలని ప్రభుత్వం నుంచి గత నెల 24న కొత్త మార్గదర్శకాలు విడుదలయ్యాయి. ఇప్పటికే ప్రభుత్వ పథకాలకు సంబంధించి నిత్యం ప్రజల్లో ఉంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమకు ఈ నివేదిక తలనొప్పిగా మారిందని హాజరు నమోదును పది రోజులుగా నిరాకరించారు. సెలవులు లేకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు పంచాయతీల్లో పనిచేస్తే యాప్‌ల పేరుతో తమకు మరింత ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీఎస్ఆర్ యాప్ ఇలా..

పంచాయతీ పరిధిలో రోజూ ఎన్ని గృహాల నుంచి చెత్త సేకరిస్తున్నారో యాప్‌లో నమోదు చేయాలి. తడి, పొడి చెత్త ఎంత పరిమాణంలో(కిలోల చొప్పున) సేకరించారో పొందుపర్చాలి. మొత్తం ఇళ్ల నుంచి రోజులో ఎంత పరిమాణంలో సేకరించారో పూర్తి వివరాలు నమోదు చేయాలి. డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతివనం, శ్మశానవాటిక వంటి ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు చెత్త సేకరణలో తిరగమనడంతో రోజువారీ పనులు పడకేస్తాయని కార్యదర్శులు వాపోతున్నారు. మారుమూల గ్రామాల్లో ఇంటర్నెట్ సమస్యతో సమయం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఓటరు జాబితా సర్వే, ఆహారభద్రత కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమాల కారణంగా సుమారు 10 యాప్‌లలో వివరాలు నమోదు చేయాల్సిన పరిస్థితి ఉంది. మరో యాప్‌తో ఇంకా కష్టాలు పెరుగుతాయని అంటున్నారు.

మా కష్టాలు ఎవరూ గుర్తించడం లేదు



పద్దెనమిది నెలలుగా పాలకవర్గం లేక, నిధులు లేక, పంచాయతీల అభివృద్ధికి అప్పు చేసి నెట్టుకొస్తున్నాం. ప్రభుత్వ పథకాల పనుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పంచాయతీల్లో ఉంటున్నాం. మా కష్టాలను ప్రభుత్వం గుర్తించడం లేదు. తాజాగా యాప్ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఎంత పని చేసినా కార్యదర్శుల పనికి తగిన గుర్తింపు లభించడం లేదు. పారిశుద్ధ్య నివేదికను సైతం పదిరోజులుగా నమోదు చేయడం లేదు. మా సమస్యను ప్రభుత్వానికి నివేదించినా ఎలాంటి స్పందన లేదు.

–ఎం.డీ.ఫరీద్, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే జైలుకే

- ఎస్పీ నరసింహ



ప్రజాభరోసా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ

తాళ్లగడ్డ (సూర్యాపేట) : ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే జైలుకు వెళ్లాల్సి వస్తుందని ఎస్పీ నరసింహ హెచ్చరించారు. బుధవారం రాత్రి సూర్యాపేట మండలం బాలెంల గ్రామంలో నిర్వహించిన పోలీస్ ప్రజాభరోసా కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత కష్టపడి చదివి ఉన్నతస్థానానికి చేరాలని సూచించారు. గ్రామాల్లో అలజడులు సృష్టించి అశాంతికి కారణమయ్యేవారిని, అక్రమ వ్యాపారాలకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని అన్నారు. ఎన్నికలు ఎలాంటివైనా గ్రామంలో అందరూ కలిసి మెలిసి ఉండాలని, ఎన్నికల సమయంలో గొడవలు పడవద్దని సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని, రోడ్డు భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. అత్యాశకు పోయి సైబర్ మోసాల బారిన పడి డబ్బు పోగొట్టుకుంటున్నారని, మత్తు పదార్థాలకు బానిసలై యువత మంచి భవిష్యత్తును కోల్పోతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్, రూరల్ సీఐ రాజశేఖర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివ కుమార్, సర్కిల్ ఎస్‌ఐలు శ్రీకాంత్, మహేశ్వర్, గోపీకృష్ణ పాల్గొన్నారు.

నూతన పద్ధతులపై దృష్టి సారించాలి

మోతె : రైతులు నూతన వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాలని భారత వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ వి.మానస అన్నారు. బుధవారం మోతె మండల పరిధిలోని సిరికొండ గ్రామంలో నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వ్యవసాయ భూమిలో మట్టి పరీక్షలు, మట్టిలో ఉన్న పోషకాలపై రైతులకు అవహన కల్పించారు. వానాకాలం సీజన్‌లో పంటల సాగులో సుస్థిరమైన పద్ధతులు, శాస్త్రీయమైన పద్ధతులు పాటించాలన్నారు. పంటల ఉత్పత్తి, నేల ఆరోగ్యం వనరులనిర్వహణను మెరుగుపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు రామకృష్ణ, కిరణ్, ఏఓ అరుణ, రైతులు నగేష్, సంజీవరెడ్డి, శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నారాయణరెడ్డి ఆశయాలు సాధించాలి



రావి నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యాపేట అర్బన్ : తెలంగాణ సాయుధ పోరాటయోధుడు, మాజీ ఎంపీ రావి నారాయణరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం సూర్యాపేట పట్టణంలో రావి నారాయణరెడ్డి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గన్నా చంద్రశేఖర్ మాట్లాడారు. రావి నారాయణరెడ్డి .. దేశంలో అత్యంత భారీ మెజారిటీతో గెలిచారని, తనకున్న 500 ఎకరాల సొంత భూమిని పేదలకు పంచిన త్యాగశీలి అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా నిత్యకల్యాణం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో బుధవారం స్వామి, అమ్మవారి నిత్యకల్యాణ వేడుకను అర్చకులు పాంచరాత్రాగామ శాస్త్రం రీత్యా చేపట్టారు. కల్యాణ సేవను ఆలయంలో ఊరేగించారు. తొలుత వేకువజామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టి, గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు అభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ చేపట్టి వేద మంత్రోచ్ఛరణల మధ్య నిత్యకల్యాణ వేడుక జరిపించారు.జాయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం జరిపించారు.

నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట ఏది!

- యథేచ్ఛగా నకిలీ విత్తనాల దందా
- మాయమాటలతో రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్న కేటుగాళ్లు
- తాజాగా తిరుమలగిరిలో నకిలీ విత్తనాల తయారీ ముఠా గుట్టురట్టు
- టాస్క్‌ఫోర్స్ తనిఖీలు మరింత ముమ్మరం చేస్తేనే మేలు

తిరుమలగిరి మండలంలో ఓ వ్యక్తి నకిలీ విత్తనాల తయారీ కేంద్రమే నడుపుతున్నాడు. ఈ కేంద్రం ద్వారా తయారుచేసిన విత్తనాలను పలువురు రైతులకు విక్రయించగా సమాచారం తెలుసుకున్న పోలీసులు తయారీ ముఠాను మంగళవారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. జిల్లాలో నకిలీ విత్తనాల వ్యాపారం సాగుతున్న తీరుకు ఈ సంఘటన అద్దం పడుతోంది.



తిరుమలగిరిలో మంగళవారం పట్టుబడిన నకిలీ పత్తిగింజలు

భానుపురి (సూర్యాపేట) : ప్రతి సీజన్‌లో నకిలీ విత్తనాలతో జిల్లాలో రైతులు ఇబ్బందుల పాలవుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం వాటిపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. సీజన్ కు ముందు విత్తనాలు, ఎరువుల దుకాణాలు తనిఖీలు చేయడంతో పాటు రైతులకు అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో మెట్ట పంటల సాగు జోరుగా సాగుతుండగా అక్రమార్కులకు ఇదే అదునుగా మారింది. నిరక్షరాస్యులైన రైతులను టార్గెట్ గా చేసుకొని కల్తీ విత్తనాలను అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఓవైపు వ్యవసాయ శాఖ, పోలీస్, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నకిలీల భరతం పట్టేందుకు ముందుకు సాగుతుండగానే అక్రమార్కులు ఇవేమీ పట్టనట్టుగా తమ వ్యాపారాన్ని యథేచ్ఛగా సాగిస్తున్నారు. నకిలీ విత్తనాలను ఇతర ప్రాంతాల నుంచి తెచ్చి మాయమాటలు చెప్పి రైతులకు అంటగట్టడమే కాకుండా.. ఏకంగా జిల్లాలోనే తయారీకి పూనుకుంటున్నారు.

వాటిపై దృష్టి పెడితేనే...

సూర్యాపేట జిల్లాకు ఏపీతోపాటు సరిహద్దు జిల్లాలైన మహబూబాబాద్, ఖమ్మం, జనగామనుంచి నిషేధిత బీటీ విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నకిలీ విత్తనాలను ఏజెంట్లద్వారా అమ్మకాలు జరిపిస్తున్నారు. అలాగే రైతులు ఏపీలోని గుంటూరు, నందిగామ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లి సైతం కొనుగోలు చేసే విత్తనాల్లో ఈ నకిలీ విత్తనాలు కూడా ఉంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి లైసెన్సులు లేకుండా విత్తనాలను అందించే ఫెర్టిలైజర్ షాపుల్లోనూ ఈ నకిలీ విత్తనాలు విచ్చలవిడిగా అమ్ముతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ప్రత్యేక బృందాలు మరింతగా..

సూర్యాపేట జిల్లాలో దాదాపు 90 వేల ఎకరాల వరకు పత్తి సాగవుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు భూములను చదును చేసుకొని పత్తి విత్తనం నాటేందుకు సిద్ధమవుతున్నారు. కొన్నిచోట్ల ఇప్పటికే విత్తనాలను కొనుగోలు చేసి విత్తుకున్నారు. ఈ పత్తి సాగు ఈనెల చివరి వరకు రైతులు చేపట్టే అవకాశం ఉండగా నకిలీ విత్తనాల బారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు మరింత కఠినంగా తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యాచరణలో భాగంగా పోలీస్ రెవెన్యూ అధికారులతో కలిసి విత్తన దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్నారు. ఈ తనిఖీలను మరింత విస్తృతం చేయాల్సి ఉంది.

రైతులూ ఇవి పాటించండి..

- ప్రధానంగా ఏజెంట్లు.. వ్యాపారులు చెప్పే మాయమాటలను నమ్మకుండా వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి.
- ఉద్దెర ఇస్తారని చెప్పి వ్యాపారులు ఏవిస్తే వాటిని కొనుగోలు చేయకుండా నేల స్వభావాన్ని బట్టి ఏ విత్తనాలు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయో వ్యవసాయ అధికారులను సంప్రదించాల్సి ఉంది.
- లైసెన్స్‌డ్ డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి. ప్యాకింగ్‌ను సరిచూసుకోవాలి.
- ఏదికొన్నా రసీదు తప్పని సరిగా తీసుకోవాలి. రసీదుతో పాటు విత్తనాలకు సంబంధించిన ఖాళీప్యాకెట్‌ను పంట దిగుబడి చేతికందేవరకు భద్రపర్చుకోవాలి.
- నిషేధిత, గడువు ముగిసిన రకాల్ని పసిగట్టాలి ధర తక్కువని, లూజుగా విక్రయించే పత్తి, మిరప విత్తనాలను కొని మోసపోవద్దు
- అంగట్లో కూరగాయల్లా ఎక్కడ విత్తనాలు విక్రయానికి పెట్టినా విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించాలి.
- రసీదులో రైతుపేరు, విత్తన కంపెనీ పేరు, చిరునామా, లాట్ నంబర్, ప్యాకెట్ల సంఖ్యను డీలర్లు తప్పక పొందుపర్చాలి.
- ప్యాకెట్‌పై లాట్‌నంబర్, డేట్ ఆఫ్ ప్యాకింగ్, లేబుల్, విత్తన మొలకశాతం సరిగా ఉందో లేదో చూసుకోవాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి. విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో తప్పకుండా రసీదుపొంది భద్రపర్చుకోవాలి. ఏదైనా అనుమానాలు ఉంటే అధికారులకు తెలియజేయాలి. ప్రత్యేక బృందాలతో నకిలీ విత్తనాలు అమ్మకుండా తనిఖీలు చేపడుతున్నాం. రైతులు అధికారులకు సహకరించాలి.

– జి.శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

పీడీయాక్ట్ నమోదు చేస్తాం



జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైన రైతులకు నకిలీ విత్తనాలను అమ్మితే పీడీయాక్ట్ నమోదు చేస్తాం. రైతులను మోసం చేస్తే ఊరుకునేది లేదు. రైతులు నకిలీ విత్తనాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులను సంప్రదించాలి.

– నరసింహ, జిల్లా ఎస్పీ

క్లుప్తంగా

అందుబాటులో ఫౌండేషన్ వరి విత్తనాలు

త్రిపురారం : మండలంలోని కంపాసాగర్ గ్రామ పరిధిలోని వరి పరిశోధన సంస్థలో (అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్)లో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ లింగయ్య బుధవారం తెలిపారు. బీపీటీ -5204 (సాంబ మసూరి), ఆర్ఎన్ఆర్-15048 (తెలంగాణ సోనా), కేపీఎస్ -6251 సన్న రకం ఫౌండేషన్ విత్తనాలు ఉన్నాయని పేర్కొన్నారు. 20 కేజీల బ్యాగ్‌కు రూ.1060 ధర నిర్ణయించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ నంబర్ 96403 70666ను సంప్రదించాలని పేర్కొన్నారు.

మోత్కూరులో చోరీ

మోత్కూరు : మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామంలో మంగళవారం సాయంత్రం ఇంటికి తాళాలు వేసిన ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండగడప గ్రామంలో అంబటి లక్ష్మయ్య అనే గీత కార్మికుడు తాటిచెట్లు ఎక్కి సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంట్లోని బీరువా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అందులోని రూ.1.20 లక్షల నగదు, సుమారు 5 తులాల బంగారం ఆభరణాలు చోరీకి గురయ్యాయి. అదే గ్రామంలో తొంట అంజికుమార్ ఇంటికి తాళం వేసి ఉండగా తాళం పగులగొట్టి రూ.2 వేల నగదు దోచుకెళ్లారు. మోత్కూరు పట్టణంలోని సుందరయ్య కాలనీలో సుమంగళి ఫంక్షన్ హాల్‌కు ఎదురుగా ఉన్న గుడిపుడి కళ్యాణికి చెందిన సుమారు రూ.30వేల విలువ చేసే స్మార్ట్ ఫోన్ అపహరించారు. మోత్కూరు ఎస్ఐ చోరీ జరిగిన స్థలాలను పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధి కూలీ మృతి

మోతె: కడుపునొప్పితో ఉపాధి పనులకు వెళ్లిన కూలీ మృతిచెందాడు. మోతె మండలంలో అన్నారిగూడెం గ్రామానికి చెందిన కొత్త శ్రీను (57) బుధవారం గ్రామంలో ఉపాధి హామీ పనికి వెళ్లాడు. పని ముగించుకొని ఇరిగి ఇంటికి వస్తున్న క్రమంలో మార్గమధ్యంలో నలతగా ఉందని కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నాడు. అనంతరం ఇంటికి వెళ్లాక కడుపునొప్పి రావడంతో వాంతులు చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వైద్యం నిమిత్తం ఖమ్మం తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

సూర్యాపేటటౌన్ : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీల్లో భాగంగా డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లు చేశారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ 10 మంది పట్టుబడ్డారు. వీరిని బుధవారం కోర్టులో హాజరు పరచగా సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బీవీ.రమణ ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా, మరొకరికి ఒకరోజు జైలు శిక్ష, రూ.4వేల జరిమానాతో పాటు మద్యం సేవించి వాహనాలు నడిపిన మిగతా ఎనిమిది మందికి కలిపి రూ.9వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

సూర్యాపేట రూరల్ : విద్యుదాఘాతంతో ఓ గేదె మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని పిల్లలమర్రిలో బుధవారం జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండ పిచ్చయ్య పాడిగేదె దాసరి జోగయ్య వ్యవసాయ క్షేత్రంలో మేతకోసం వెళ్లి మోటారు స్టార్టర్ వైర్ తగిలి మృతి చెందినట్లు తెలిపారు.

లారీని ఢీకొట్టిన బస్సు

- బస్సు డ్రైవర్, మహిళా ప్రయాణికురాలు మృతి
- 18మందికి గాయాలు
- చౌటుప్పల్ మండలం ఖైతాపురం వద్ద ఘటన



ధ్వంసమైన ప్రైవేట్ ట్రావెల్ బస్సు ముందు భాగం

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం ఖైతాపురం గ్రామ స్టేజీ సమీపంలో హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో బస్సు డ్రైవర్‌తో పాటు బస్సులో ఉన్న ఓ ప్రయాణికురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా కందుకూరు నుంచి శివాంజలి ప్రైవేట్ ట్రావెల్ బస్సు 34 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపురం గ్రామ సమీపంలోకి వచ్చే సరికి జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న ఓ ట్రాలీ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ప్రకాశం జిల్లా జిరుగుమల్లి మండలం చిర్రిపాడు గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ కొండల్‌రావు(42) బస్సు క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. డ్రైవర్ వెనుక సీటులో కూర్చున్న ప్రకాశం జిల్లా పొన్నులూరు మండలం వరుచూరివారిపాలెం గ్రామానికి చెందిన దండి బోమిన గోవిందమ్మ(47)కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలు గోవిందమ్మకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. వారిద్దరితో కలిసి హైదరాబాద్‌లో బంధువుల ఇంటి వద్ద ఫంక్షన్ ఉండడంతో కుందుకూరు నుంచి బస్సులో వెళ్తోంది.

డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించిన పోలీసులు

బస్సు ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 34 మంది ఉండగా అందులో 18మందికి గాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామానికి చెందిన పోకూరు భుజంగరావు, చేగూర్తి మండలం బొ్రసపల్లికి చెందిన బండారి వినోద్, గుర్చసాల సుజాత, జనుగుపల్లి మండలం పాల్వాయి గ్రామానికి చెందిన వంజ అంకమ్మ, బీమకుర్తి మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన పులి సన్ని, వల్లెటిపాలెం మండలం నందలపర్ గ్రామానికి చెందిన సుశీల, పోకూరు గ్రామానికి చెందిన పల్లపు శివమ్మ, భూపాలపురం గ్రామానికి చెందిన ప్రగాడ శ్రీనివాసులు, చండి అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన బచ్చు మల్యాద్రి, సుజాత నగర్‌కు చెందిన యనమల మమత, వల్లెటిపాలెం మండలం చిన్నమ్మపాలెం గ్రామానికి చెందిన దేవిళ్ల జయమ్మ, దేవిళ్ల మల్లేశ్వరి, నెల్లూరు జిల్లా కందుకూరు మండల కేంద్రానికి చెందిన యనమల మమత, లింగసముద్రం మండలం తూమగుంట గ్రామానికి చెందిన మీటినేని విజయ,ఉలువపాడు మండలం రామాయపట్నం గ్రామానికి చెందిన అప్పనగిరి సురేష్, అప్పనగిరి జ్యోతి, కొత్తపట్నం మండలం పల్లెపాడు గ్రామానికి చెందిన నాయుడు వెంకయ్య, నాయుడు రజని గాయపడినవారిలో ఉన్నారు. వీరిలో కొంతమందిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రి, మరికొంత మందిని హైదరాబాద్‌లోని ఉస్మానియా, హయత్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన డ్రైవర్ కొండల్‌రావు, ప్రయాణికురాలు గోవిందమ్మ మృతదేహాలకు చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను వారి బంధువులకు అప్పగించారు. ఈ ప్రమాదంపై మృతురాలు గోవిందమ్మ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. బస్సు ప్రమాద సమయంలో డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నాడని ప్రాథమికంగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.


మృతి చెందిన డ్రైవర్ కొండల్‌రావు (ఫైల్)


ప్రయాణికురాలు గోవిందమ్మ (ఫైల్)

క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు కృషి


రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం
- మంగళపల్లిలో ప్రారంభమైన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు
- ఉమ్మడి 10 జిల్లాల నుంచి హాజరైన 450 మంది క్రీడాకారులు

నకిరేకల్: క్రీడాకారుల్లో క్రీడానైపుణ్యాన్ని వెలికి తీసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ మండలంలోని మంగళపల్లి గ్రామంలో మూడు రోజుల పాటు జరగనున్న 47వ తెలంగాణ హ్యాండ్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాల నుంచి 450 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. తన వంతుగా క్రీడాకారుల సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ మాట్లాడుతూ.. ఇక్కడ ప్రతిభ చూపిన క్రీడాకారులను రెండు జట్లుగా ఎంపిక చేసి ఈనెల 18 నుంచి బీహార్‌లోని నవాడలో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉస్మాన్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, ఏవీఎం విద్యాసంస్థల అధినేత కందాల పాపిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నకిరేకంటి ఏసుపాదం, స్థానిక పాఠశాల హెచ్ఎం కర్ర వీరారెడ్డి, స్థానిక పాల కేంద్రం చైర్మన్ చింతల ముత్తయ్య పాల్గొన్నారు.


క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

కారును ఢీకొన్న మరో కారు

- ప్రమాదానికి గురైన కారును వెనుక నుంచి ఢీకొట్టిన లారీ
- ప్రమాదంలో యువతి మృతి



ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు

చౌటుప్పల్ : కారును మరో కారు ఢీకొంది. ప్రమాదానికి గురైన కారును వెనకాల నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో యువతి మృతిచెందగా.. పలువురికి గాయాలయ్యాయి. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఎలిమినేటి మాధవరెడ్డి బీఈడీ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ సంస్థకు చెందిన ముగ్గురు ఉద్యోగులు మార్కెటింగ్‌లో భాగంగా చౌటుప్పల్‌కు ఆల్టో కారులో వచ్చారు. పలు వెంచర్లను సందర్శించి ప్లాట్ల కొనుగోలు చేసే వారిని కలిశారు. అనంతరం మార్కెటింగ్ అంశాలపై చర్చించేందుకు మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలోని ఓ ప్రముఖ పరిశ్రమకు కారులో వెళ్తున్నారు. బీఈడీ కళాశాల దాటాక రెండు లారీలు రోడ్డుకు సమాంతరంగా వెళ్తున్నాయి. అదే సమయంలో ఆల్టో కారును డ్రైవింగ్ చేస్తున్న మార్కెటింగ్ ఉద్యోగి మిథిలేష్ కొంత ఎడమవైపుకు తిప్పే క్రమంలో వెనుక నుంచి వచ్చిన ఇండికా కారు వీరి కారును ఢీకొట్టింది. దీంతో ఆల్టో కారు ముందున్న లారీని ఢీకొంది. అదేవిధంగా ఆ కార్ల వెనకాలే వచ్చిన విజయవాడ వైపునకు వెళ్తున్న ఉల్లిగడ్డల లోడు లారీ ఆల్టో కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆల్టో కారులో వెనుక సీట్లో కూర్చున్న హైదరాబాద్‌లోని బోయినపల్లికి చెందిన మార్కెటింగ్ ఉద్యోగి శ్రావణి (29) అక్కడికక్కడే మృతిచెందింది. కారు ముందు సీట్లో కూర్చున్న నాగోల్‌కు చెందిన శ్రీనివాస్‌రావు, కారు డ్రైవింగ్ చేస్తున్న మిథిలేష్‌కు గాయాలయ్యాయి. శ్రీనివాస్‌రావును చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఇండికా కారులో ప్రయాణిస్తున్న నల్లగొండ జిల్లా కట్టంగూరుకు చెందిన యాదగిరి(35), రేణుక(30), ధరణి(13), వేణుతేజ(14), మణిభార్గవి(13)కు సైతం గాయాలయ్యాయి. వీరిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. సంఘటనా స్థలాన్ని సందర్శించిన పోలీసులు కారులో ఇరుక్కున్న శ్రావణి మృతదేహాన్ని బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.


మృతురాలు శ్రావణి (ఫైల్)

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

కోదాడరూరల్ : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన కోదాడ మండల పరిధిలోని ఆర్టీఓ చెక్‌పోస్టు వద్ద బుధవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన నారోజు రాఘవ(35) ప్రస్తుతం కోదాడలో ఉంటూ రామాపురం క్రాస్‌రోడ్‌లోని ప్రైవేట్ కంపెనీలో సైట్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. పనులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. ఈక్రమంలో మార్గమధ్యంలో చెక్‌పోస్టు వద్దకు చేరుకోగానే విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అతడి బైక్‌ను వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో రాఘవ తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అదే కారు అదుపుతప్పి మరో కారును ఢీకొట్టి రోడ్డు కిందకు వెళ్లడంతో కారు దెబ్బతిన్నది. అందులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ సంఘటనపై మృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ నిజాముద్దీన్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతి

నాగార్జునసాగర్: గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. నాగార్జునసాగర్ ఎస్ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. పైలాన్ కాలనీలోని బైపాస్ మూడు రోడ్ల కూడలి సమీపంలో సుమారు 70ఏళ్లకు పైబడిన వృద్ధుడు గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడు. గత వారం రోజులుగా భిక్షాటన చేస్తూ స్థానికంగా సంచరిస్తున్నాడని, రాత్రి వేళ ఫుట్‌పాత్‌పై నిద్రపోయేవాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పిచ్చికుక్కల దాడిలో పలువురికి గాయాలు

హుజూర్‌నగర్‌రూరల్: హుజూర్‌నగర్ మండలంలోని అమరవరం గ్రామం, మఠంపల్లి మండలంలోని అల్లీపురం గ్రామంలో బుధవారం పిచ్చికుక్కలు దాడి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులు హుజూర్‌నగర్ వైద్యశాలలో వ్యాక్సిన్ వేయించుకున్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

గంటల వ్యవధిలోనే దంపతుల మృతి

- చాతి నొప్పితో బాధపడుతూ మృతిచెందిన భర్త, క్యాన్సర్ బారిన పడి చికిత్స పొందుతూ భార్య మృతి


గుర్రం సునీత- నర్సింహ దంపతులు (ఫైల్)

రామన్నపేట: వారిద్దరు దంపతులు. వారికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. భర్త ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య క్యాన్సర్ బారిన పడడంతో భర్త మానసికంగా కుంగిపోయాడు. భర్త చనిపోయిన పోయిన కొద్ది గంటల వ్యవధిలోనే భార్య కూడా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామంలో చోటుచేసుకున్న ఘటన అందరినీ కలచివేసింది. ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన రేపాక సునీత(41)కు చిట్యాల మండలం వెలిమినేడుకు చెందిన గుర్రం నర్సింహ(45)తో సుమారు పద్దెనిమిది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. పెళ్లయినప్పటి నుంచి ఇంద్రపాలనగరంలోనే అద్దె ఇంట్లో కాపురం ఉంటున్నారు. వారి కుమార్తె అమ్ములు స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి, కుమారుడు శివ 8వ తరగతి చదువుతున్నాడు. నర్సింహ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గిరాకీలు లేక నర్సింహ రోజువారీ కూలీపనులకు వెళ్తూ వచ్చే ఆదాయంతో బతుకు బండిని లాగుతున్నాడు. ఈక్రమంలో భార్య సునీత రెండేళ్ల క్రితం క్యాన్సర్ బారిన పడింది. హైదరాబాద్‌లో చికిత్స పొందుతోంది. రెండు రోజుల క్రితం సునీత తన తల్లితో కలిసి హైదరాబాద్ వెళ్లి వైద్యం నిమిత్తం ఓ ఆస్పత్రిలో చేరింది. రోజు మాదిరిగానే కూలీపనులకు వెళ్లి వచ్చిన నర్సింహ మంగళవారం రాత్రి ఇంట్లో పడుకున్నాడు. బుధవారం తెల్లవారుఝామున చాతిలో నొప్పి రావడంతో తలుపుతీసి పక్కింటి వాళ్లను లేపే ప్రయత్నం చేశాడు. వీలుకాక పోవడంతో తన స్నేహితుడికి ఫోన్‌చేసి తన పరిస్థితిని తెలిపాడు. అతను తన పొరుగువారితో వచ్చి గోడదూకి ఇంట్లోకి ప్రవేశించాడు. చికిత్స నిమిత్తం కారులో భువనగిరి ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే నర్సింహ మృతి చెందినట్లు తెలిపారు. నర్సింహ మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చిన కొద్దిసేపటికే ఆస్పత్రి నుంచి సునీత చనిపోయినట్లు సమాచారం వచ్చింది. దీంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. భార్య సునీత అనారోగ్యం పాలైనప్పటి నుంచి నర్సింహ మానసికంగా కుంగిపోయాడని గ్రామస్తులు తెలిపారు. తల్లిదండ్రులు చనిపోవడంతో పిల్లలు అమ్ములు, శివ అనాథలయ్యారు.

సన్నీ యాదవ్ ఆచూకీ తెలపాలి

- హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన తల్లిదండ్రులు

నూతనకల్: యూట్యూబ్ వ్లాగర్, బైక్ రైడర్ బయ్యా సన్నీ యాదవ్ ఆచూకీ కోసం అతడి తల్లిదండ్రులు హైకోర్టులో బుధవారం పిటిషన్ దాఖలు చేసినట్లు సమాచారం. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రానికి చెందిన బయ్యా సన్నీ యాదవ్ ప్రపంచ బైక్ రైడర్‌గా తన అనుభవాలను యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేశాడు. ఇటీవల పాకిస్తాన్‌లో బైక్ రైడ్ చేసి ఆ వీడియోలను తన యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేయడంతో ఓ నెటిజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చెన్నై ఎయిర్‌పోర్టులో గత నెలలో ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకుని ఢిల్లీ కార్యాలయానికి తరలించినట్లు తెలిసింది. ఆ రోజు నుంచి నేటికీ సన్నీ యాదవ్ సమాచారం తెలియకపోవడంతో తల్లిదండ్రులు తమ కుమారుడి ఆచూకీ తెలపాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు సమాచారం.

బాస్కెట్‌బాల్ భారత జట్టుకు మిర్యాలగూడ వాసి

మిర్యాలగూడ: బాస్కెట్‌బాల్ అండర్-16 భారత జట్టుకు మిర్యాలగూడ పట్టణానికి చెందిన వ్యాపారవేత్త జొన్నలగడ్డ వెంకట్‌రెడ్డి కుమార్తె విహారెడ్డి ఎంపికైంది. జూన్ 10 నుంచి మాల్దీవ్స్‌లో జరిగే ఏషియన్ గేమ్స్‌లో నిర్వహించే బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టు తరుపున విహారెడ్డి పాల్గొననున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి మొట్టమొదటిసారిగా జాతీయ జట్టుకు ఎంపికైన విహారెడ్డిని మిర్యాలగూడ పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.


బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికైన విహారెడ్డి

మరణించి ఇద్దరికి వెలుగునిచ్చిన హెడ్ కానిస్టేబుల్

కనగల్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కనగల్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బొల్లెపల్లి సైదులు నేత్రాలను దానం చేసేందుకు కుటుంబసభ్యులు ముందుకువచ్చారు. ఐ డొనేషన్ కోసం కుటుంబసభ్యులను కనగల్ ఎస్ఐ విష్ణుమూర్తి ఒప్పించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్టుకు కళ్లను దానం చేశారు. ఈ నేత్రదానం ద్వారా ఇద్దరు కార్నియా అంధులకు వెలుగు వచ్చే అవకాశం ఉంది.


బొల్లెపల్లి సైదులు

కారు బైక్ ఢీ.. యువకుడికి గాయాలు

ఆలేరురూరల్: కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో యువకుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆలేరు మండలంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన బింగి దామోదర్ పనినిమిత్తం ఆలేరుకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. కొలనుపాక వాగు వద్దకు రాగానే బచ్చనపేట నుంచి కారు ఆలేరుకు వెళ్తుండగా రెండు వాహనాలు ఎదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న దామోదర్‌కు గాయాలయ్యాయి, అతడిని స్థానికులు వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆలేరు పోలీసులను సంప్రదించగా.. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.


ప్రమాదస్థలం వద్ద కారు, బైక్

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

చౌటుప్పల్ రూరల్: అక్రమంగా కబేళాకు తరలిస్తున్న పశువులను చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద బుధవారం పోలీసులు పట్టుకున్నారు. జనగాంలోని నవాబ్ మార్కెట్‌లో 5 ఎద్దులను కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని తుక్కుగూడకు తరలిస్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాయి. ఈమేరకు పశువులను రవాణా చేస్తున్న పహడిషరీఫ్‌కు చెందిన ఎండీ ఉమర్, సూర్యాపేటలోని జేజేనగర్‌కు చెందిన ఎండీ మజాయిద్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నర్సిరెడ్డి తెలిపారు.

గడ్డిమోపుల కింద ఆవులను తరలిస్తుండగా..


వాహనంలో తరలిస్తున్న పశువులు

భువనగిరిటౌన్ : ఎండు గడ్డిమోపుల కింద ఆవులను దాచి రవాణా చేస్తుండగా బుధవారం భువనగిరిలో భజరంగ్ దళ్ నాయకులు పట్టుకున్నారు. రవాణా ట్రక్కు వాహనంలో అడుగున 17 ఆవులను కట్టివేసి పైన ఎండుగడ్డి మోపులను పేర్చి ఆంధ్రప్రదేశ్ రంపచోడవరం నుంచి హైదరాబాద్‌కు అక్రమ రవాణా చేస్తున్నట్లు గోరక్షకులకు సమాచారం వచ్చింది. భజరంగ్ దళ్ జిల్లా, పట్టణ కన్వీనర్లు బింగి భరత్, నవీన్ తదితరులు బైకులపై ఆవులను అక్రమ రవాణా చేస్తున్న వాహనాన్ని వెంటాడి స్థానిక సింగన్నగూడెం చౌరస్తాలో పట్టుకున్నారు. అనంతరం పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పట్టణ ఎస్సై లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి ఆవులను రాజాపేట మండలం చల్లూరు గోశాలకు తరలించారు. వాహనాన్ని సీజ్ చేసి యజమాని రాజు పత్లావత్, డ్రైవర్ మధు, క్లీనర్ కుమార్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇక్కత్ కళా నైపుణ్యం భేష్


టూరిజం పార్కులో చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థులు

- పోచంపల్లిని సందర్శించిన ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి: ఇక్కత్ కళ నైపుణ్యాలు భేషుగ్గా ఉన్నాయని ఫ్యాషన్, ఇంటీరియర్ డిజైనింగ్ విద్యార్థుల బృందం కొనియాడారు. హైదరాబాద్‌లోని రూట్స్ కాలేజ్ ఆఫ్ ఫ్యాషన్ అండ్ ఇంటీరియర్ డిజైనింగ్ కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థులు బుధవారం భూదాన్‌పోచంపల్లిలో పర్యటించారు. చేనేత గృహాలు, స్థానిక రూరల్ టూరిజం పార్కును సందర్శించారు. నూలు, రంగుల అద్దకం, చిటికి కట్టడం, టైఅండ్‌డై విధానం, మగ్గాలపై తయారవుతున్న చేనేత వస్త్రాలను పరిశీలించారు. ఇక్కత్ డిజైన్లను చూసి చేనేత కళాకారుల నైపుణ్యాలను కొనియాడారు. కాలేజీ ఫ్యాకల్టీ మోహనశ్రీ మాట్లాడుతూ.. స్టడీ టూర్‌లో భాగంగా ఇక్కత్‌కు ప్రసిద్ధి చెందిన పోచంపల్లికి వచ్చినట్లు చెప్పారు. నేటి ఫ్యాషన్ రంగానికి, ఇంటీరియర్‌కు పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు ఎంతో అనువుగా ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ హబీబ్ పడాల, ఫ్యాకల్టీ కావ్య, ఉష, అంకిత, విద్యార్థులు పాల్గొన్నారు.

పేలిన ఆర్టీసీ బస్సు టైర్లు

- డ్రైవర్ బస్సును అదుపు చేయడంతో తప్పిన ప్రమాదం

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలంలోని తుక్కాపురం స్టేజీ వద్ద బుధవారం సాయంత్రం ఆర్టీసీ బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. తొర్రూరు డిపోకు చెందిన ఆర్టీసీ సెమి లగ్జరీ బస్సు హైదరాబాద్ నుంచి ఆత్మకూరు(ఎం)మీదుగా మోత్కూరు వైపు వెళ్తుంది. మండలంలోని తుక్కాపురం స్టేజి వద్దకు వెళ్లగానే బస్సు వెనుక భాగంలోని రెండు టైర్లు పేలిపోయాయి. డ్రైవర్ బస్సును చాకచక్యంతో అదుపు చేయడంతో పెనుప్రమాదం తప్పింది. బస్సులో సుమారు 50 మంది ప్రయాణికులు ఉన్నారు. వారిని మరో బస్సులో పంపించారు.

